క్లుప్తంగా

పఠనాశక్తిని పెంపొందించుకోవాలి



వేసవి విజ్ఞాన శిబిరంలో పాల్గొన్న చిన్నారులు

కడియం: ప్రతి విద్యార్థి పఠనాశక్తిని పెంపొందించుకోవాలని గ్రంథాలయ సభ్యులు భాస్కరరావు అన్నారు. స్థానిక లైబ్రరీలో జరుగుతున్న వేసవి విజ్ఞాన తరగతుల్లో భాగంగా ఆదివారం విద్యార్థులకు పుస్తక పఠనం ప్రాధాన్యాన్ని వివరించారు. అలాగే కోవిడ్ బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలిపారు. కథలు చదివించి, వ్యాసరచన పోటీలు ఏర్పాటు చేశారు. తెలుగు వ్యాకరణం గురించి లైబ్రేరియన్ శ్రీదేవినిర్మల వివరించారు. స్థానికులు వేంకటేశ్వరరావు, 108 సిబ్బంది నారాయణ, విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రసన్నాంజనేయస్వామి నిజరూప దర్శనం



ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): రాజమండ్రి ఐదు బళ్ల మార్కెట్ సెంటర్‌లో వేంచేసియున్న ప్రసన్నాంజనేయ స్వామివారి ఆలయంలో హనుమాన్ జయంతిలో భాగంగా 31వ జయంత్యుత్సవం సందర్భంగా ఆదివారం స్వామివారు నిజరూప దర్శనం ఇచ్చారు. ముందుగా స్వామివారికి సిందూరం, తమలపాకు పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారికి పూజలు నిర్వహించి, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

సేవా కార్యక్రమాలు విస్తరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న చింతా ప్రసాద్‌రెడ్డి

రాజమహేంద్రవరం సిటీ: మానవతా సేవా సంస్థ కార్యక్రమాలను క్షేత్ర స్థాయిలో విస్తరించేందుకు కృషి చేయాలని సంస్థ రీజనల్ చైర్మన్ చింత ప్రసాద్‌రెడ్డి కోరారు. ఆదివారం సంస్థ అధ్యక్షుడు పాలకృష్ణ ప్రసాద్‌రెడ్డి అధ్యక్షతన సంస్థ రాజమహేంద్రవరం శాఖ కార్యాలయంలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా చింత ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ, సంస్థ నిర్వహిస్తున్న సామాజిక కార్యక్రమాలను ప్రజలకు చేరువ చేసేందుకు ప్రతి సభ్యుడు కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా 2025-26కు నూతన కార్యవర్గ ఎన్నికలపై సమీక్షించారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు మద్దుల మురళీకృష్ణ, బూరగడ్డ మురళి, కొమ్మా శ్రీనివాస్, గాంధీ, ఎం.ధర్మారెడ్డి, రుద్రమదేవి, బొదిరెడ్ల అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల బకాయిలు చెల్లించాలి

కంబాలచెరువు: గత ఆరేళ్లుగా పేరుకుపోయిన ఉద్యోగుల బకాయిలు వెంటనే చెల్లించాలని ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పి.రవికుమార్ ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ పరిధిలో ఉన్న ఆసుపత్రుల్లో అవుట్ పేషెంట్, ఇన్ పేషెంట్ రోగుల సంఖ్య పెరిగిన కారణంగా కేడర్ స్ట్రెంగ్త్ మార్చి ఉద్యోగుల సంఖ్య పెంచేలా ఖాళీ పోస్టులను భర్తీ చేయాలన్నారు. రాజమండ్రిలో కేవలం ముగ్గురు రేడియోగ్రాఫర్లు ఓల్డ్ పాటర్న్‌లో ఉన్నారన్నారు. రెండు పోస్టులు ఖాళీగా ఉండగా, ఒక రేడియోగ్రాఫర్ మాత్రమే ఉన్నారన్నారు. ప్రభుత్వ సామాన్య ఆసుపత్రికి 24 గంటలు షిఫ్ట్ డ్యూటీల ప్రకారం పది మంది వరకు రేడియోగ్రాఫర్ల అవసరం ఉందన్నారు. కొత్తగా ఏర్పడిన ప్రభుత్వ సామాన్య ఆసుపత్రులలో వెంటనే రేడియోగ్రాఫర్ల పోస్టులు మంజూరు చేయాలని కోరారు.

బాలికపై లైంగిక దాడికి యత్నం

సీతానగరం: పిన్ని ఇంటికి కూర పట్టుకెళ్లిన బాలికపై ఓ వ్యక్తి లైంగిక దాడికి యత్నించినట్టు పోక్సో కేసు నమోదు చేశామని ఎస్సై డి.రామ్ కుమార్ తెలిపారు. ఆదివారం మునికూడలిలో జరిగిన ఈ సంఘటనకు సంబంధించి ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సుమారు 11 ఏళ్ల బాలికను ఆమె తల్లి పొరుగు వీధిలో ఉంటున్న తన పిన్ని ఇంట్లో కూర పెట్టిరమ్మని పంపించింది. పిన్ని ఇంట్లో లేకపోవడంతో ఆ బాలిక తన వెంట తాళం పట్టుకెళ్లింది. తాళం తెరిచేందుకు యత్నించగా, అది రాకపోవడంతో.. పక్క ఇంట్లో ఉంటున్న 38 ఏళ్ల వ్యక్తిని తాళం తెరవాలని కోరింది. తాళం తీసిన ఆ వ్యక్తి.. బాలికను అనుసరించి ఇంట్లోకి ప్రవేశించాడు. ఆ బాలికపై లైంగిక దాడికి యత్నించడంతో.. ఈ హఠాత్పరిణామానికి భీతిల్లిన ఆ బాలిక అతడి నుంచి తప్పించుకుని కేకలు పెడుతూ ఇంటి నుంచి బయటకు పరుగెత్తింది. స్థానికులు అక్కడకు చేరుకోవడంతో ఆ వ్యక్తి పరారయ్యాడు. ఈ మేరకు బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదుపై పోక్సో కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

ఈ శ్రమ ఫలించేలా..

- డెలివరీ బాయ్స్ ఈ-శ్రమ్ పోర్టల్‌లో నమోదు
- అసంఘటిత కార్మికులుగా గుర్తింపు
- 31 వరకు ప్రత్యేక డ్రైవ్
- ప్లాట్‌ఫాం వర్కర్ల హర్షాతిరేకాలు



రాజమహేంద్రవరం సిటీ: కొన్నేళ్ల క్రితం ఏం సరకులు కావాలన్నా సమీపంలోని కిరాణా స్టోర్లకు వెళ్లి తెచ్చుకునేవారు. రెస్టారెంట్‌కి వెళ్లి భోజనం చేసేవారు. ఎలక్ట్రానిక్ వస్తువులనూ షాపుల్లో కొనుక్కునేవారు. కార్పొరేట్ సంస్థల రంగప్రవేశంతో వ్యాపార వ్యవస్థ ముఖచిత్రం సమూలంగా మారిపోయింది. ఏం కావాలన్నా క్షణాల్లో ముందు వచ్చి వాలుతోంది. ఆర్డర్ పెట్టిన పది నిమిషాల్లో కాలింగ్ బెల్ కొట్టి మరీ అందిస్తున్నారు. ఎక్కడికి వెళ్లాలన్నా బైక్, ఆటో, కార్లు మనం ఉన్న లోకేషన్‌కే వచ్చి పికప్ చేసుకుని గమ్యస్థానానికి చేరుస్తున్నారు. ఇదంతా డెలివరీ బాయ్స్ వల్లే సాధ్యమవుతోంది.

కార్పొరేట్ కంపెనీల రాకతో..

అమెజాన్, జొమాటో, స్విగ్గీ, ఉబర్, రాపిడో, ఓలా, బిగ్ బాస్కెట్, ఫ్లిప్‌కార్ట్, బ్లింకిట్ లాంటి సంస్థల్లో పనిచేసే కార్మికులు ప్లాట్‌ఫాం వర్కర్లుగా గుర్తింపు కలిగి, గిగ్-ఆధారిత పద్ధతిలో ఆన్‌లైన్ ప్లాట్‌ఫాం (మొబైల్ యాప్స్) ద్వారా పనిచేసే అసంఘటిత రంగ కార్మికులకు జారీ చేసే గుర్తింపు కార్డులు పొందేలా కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. తద్వారా కేంద్ర ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ పథకాలను పొందడానికి వీరు అర్హులవుతారు. అమెజాన్, స్విగ్గీ, జొమాటో, బిగ్ బాస్కెట్, రాపిడో, ఉబర్, ఓలా, ఫ్లిప్‌కార్ట్, బ్లింకిట్‌ల ద్వారా ఆహార, సరకు రవాణా, డెలివరీ రైడ్-షేరింగ్, కొరియర్ సేవలు అందించే వ్యక్తులు, డ్రైవర్లు, ప్లాట్‌ఫాం కార్మికులందరూ అసంఘటిత రంగ కార్మికుల కింద వస్తారు. వీరంతా ఉచిత నమోదుకు అర్హులు.

శ్రామిక శక్తిని ప్రోత్సహించడానికి..

శ్రామిక శక్తిని ప్రోత్సహించడానికి కేంద్ర బడ్జెట్ 2025-26లో అసంఘటిత రంగంలో పనిచేసే కార్మికుల కోసం కొన్ని సంక్షేమ ప్రయోజనాలను ప్రతిపాదించారు. ఆయా ప్రయోజనాలు పొందడానికి ప్లాట్‌ఫాం కార్మికుల పేర్లు ఈ-శ్రమ్ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలి.



సచివాలయంలో డెలివరీ బాయ్స్ కార్డుల నమోదు ప్రక్రియను పరిశీలిస్తున్న సహాయ కార్మిక కమిషనర్ వలి

నేరుగా నమోదు కాదు

డెలివరీ బాయ్స్ కోసం ఈ-శ్రమ్ పోర్టల్‌లో నేరుగా నమోదు చేసుకోవడం సాధ్యం కాదు. ఈ-శ్రమ్ పోర్టల్‌లోకి వెళ్లిన తర్వాత, అక్కడ ప్లాట్‌ఫాం వర్కర్స్ అనే లింక్ ఉంటుంది. అది ఓపెన్ చేసి.. వివరాలను నమోదు చేస్తేనే వీరికి నమోదు అవుతుంది. నమోదు చేసుకోవడం తెలియకపోతే వార్డ్/గ్రామ సచివాలయాలు, కార్మిక శాఖ కార్యాలయాల్లోని సెంటర్లలో ఉచిత నమోదు చేస్తున్నారు. వయసు 16 నుంచి 59 ఏళ్ల మధ్యన ఉండాలి, ఆదాయపు పన్ను పరిధిలో లేని వారై ఉండాలి. వీరికి ఆయుష్మాన్ భారత్-పీఎం జన్ ఆరోగ్య యోజన కింద రూ.5.లక్షల వార్షిక ఆరోగ్య బీమా వర్తిస్తుంది.

31 వరకు ప్రత్యేక డ్రైవ్



రాష్ట్ర కార్మిక శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 31వ తేదీ వరకు ప్రత్యేక ప్రచార, అవగాహన, నమోదు కార్యక్రమాలను స్పెషల్ డ్రైవ్ ద్వారా నిర్వహిస్తున్నాం. ఈ డ్రైవ్‌లో భాగంగా నగరవ్యాప్తంగా రిజిస్ట్రేషన్ శిబిరాల నిర్వహణ, ప్లాట్‌ఫాం కార్మికుల హక్కులపై అవగాహన కల్పించడం చేస్తున్నాం.
– బీఎంఎస్ వలి, సహాయ కార్మిక కమిషనర్, రాజమండ్రి

నమోదు చేయడం ఆనందదాయకం

డెలివరీ బాయ్స్ అని చులకన భావం ఉంది. కొంత మంది అయితే లేట్ అయిందని ఆర్డర్ క్యాన్సిల్ చేయడం లేదా రేటింగ్ తగ్గించడం చేస్తున్నారు. కొన్నిసార్లు తిట్టిన సందర్భాలున్నాయి. కేంద్ర ప్రభుత్వం మా కోసం ఆరోగ్య భద్రత కల్పించి, ఈ-శ్రమ్ కార్డులు అందించడం ఆనందదాయకం.
– ఎస్.రాజాబాబు, డెలివరీ బాయ్

వీరాస్వామి సేవలు స్ఫూర్తిదాయకం



వీరాస్వామి విగ్రహం వద్ద శ్రద్ధాంజలి ఘటిస్తున్న నర్సరీ రంగ ప్రముఖులు, గ్రామస్తులు

కడియం: నర్సరీ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు, సేవా తత్పరుడు తాడాల వీరాస్వామి (పెద్దకాపు) సేవలు స్ఫూర్తిదాయకమని పలువురు వక్తలు కొనియాడారు. మండలంలోని బుర్రిలంకలో ఆదివారం ఆయన జయంతిని పురస్కరించుకుని తాడాల వెంకటరాయుడు నగర్ కాలనీ వద్దనున్న పెద్దకాపు విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. నర్సరీ రంగ ప్రముఖులు పాటంశెట్టి చిన్నమహాలక్ష్మీనాయుడు, తాడాల కొండరాజు, తాడాల విష్ణుచక్రవర్తి, జేటీ రామారావు తదితరులు మాట్లాడుతూ, వీరాస్వామి సేవలను గుర్తు చేసుకున్నారు. కడియం ప్రాంత నర్సరీ రంగం అభివృద్ధికి ఎంతో కృషి చేశారన్నారు. ఎన్నో వ్యయప్రయాసలకోర్చి రైతులను ఏకతాటిపైకి తెచ్చారన్నారు. సేవా దృక్పథంతో పేదలను ఆదుకునేందుకు ముందుండేవారని వీరాస్వామి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ప్రముఖులు తాడాల రామకృష్ణ, రాధాకృష్ణ, కొత్తపల్లి పల్లాలు, ధనంజయ, సుబ్బరాజు, తోట రాముడు, రాజు, వీరాస్వామి కుటుంబ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

తీవ్ర ఆర్థిక సంక్షోభంలో రైతులు

సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు వనజ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అక్కినేని వనజ

ప్రకాశంనగర్: అన్నపూర్ణగా పిలిచే ఆంధ్రప్రదేశ్‌లో రైతులు తీవ్ర ఆర్థిక సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్నారని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ ఆందోళన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది దాటినా.. ఇచ్చిన హామీలు అమలు చేయకుండా తాత్సారం చేస్తోందని మండిపడ్డారు. ఆదివారం ఆమె స్థానిక సీపీఐ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ, గోదావరి నది పరివాహక ప్రదేశాన్ని అనుకుని సుమారు 2,500 మంది రైతులు ఏటా వరదల కారణంగా నష్టపోతున్నారని, వారిని ఆదుకోవాలని చెప్పారు. వరదలతో రైతులు నష్టపోకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఇళ్ల స్థలాల సమస్యపై వచ్చే నెల రెండో తేదీన మండల కార్యాలయాల వద్ద జరిగే ధర్నాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం ధర్నా పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఆమె వెంట పార్టీ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు ఉన్నారు.

సీహెచ్‌ఓల సమ్మె విరమణ

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరులోని జిల్లా కలెక్టరేట్ వద్ద ఏపీ మిడ్‌లెవెల్ హెల్త్ ప్రొవైడర్స్(ఎంఎల్‌హెచ్‌పీ)/కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ అసోసియేషన్ (ఏపీఎంసీఏ) ఆధ్వర్యంలో తమ డిమాండ్ల సాధనకు 27 రోజులుగా సీహెచ్‌వోలు చేస్తున్న నిరవధిక సమ్మెను విరమించారు. ఈ మేరకు రాష్ట్ర ఉపాధ్యక్షురాలు టి.మమత ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సీహెచ్‌వోల డిమాండ్లపై రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సానుకూలంగా స్పందించడంతో సమ్మె విరమిస్తున్నట్లు ఏపీఎంసీఏ నాయకులు నిరంజన్, సందీప్, వినోద్ ప్రకటించారన్నారు. సోమవారం నుంచి సీహెచ్‌ఓలు ఎప్పటిలాగే విధులు నిర్వహిస్తారన్నారు. తమకు సమ్మె కాలంలో అనుమతి ఇచ్చిన జిల్లా కలెక్టర్, జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి, పోలీసు అధికారులకు, వైద్యారోగ్య శాఖ కార్యాలయ సిబ్బందికి, మెడికల్ ఆఫీసర్లకు ధన్యవాదాలు తెలిపారు. తమకు పూర్తి మద్దతుగా నిలిచిన సూపర్‌వైజర్ కేడర్ ఉద్యోగులకు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలకు, వివిధ సంఘాల నేతలకు కృతజ్ఞతలు చెప్పారు.

ఆనాటి కాలం.. తిరిగిరాదు నేస్తం



పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు

16 ఏళ్ల తర్వాత పూర్వ విద్యార్థుల కలయిక

రాజమహేంద్రవరం రూరల్: వారంతా ఒక్కసారిగా చిన్నపిల్లలు అయిపోయారు. తాము చదువుకున్న రోజులలో చేసిన అల్లరిని, ఆనాటి సంగతులను నెమరువేసుకున్నారు. దాదాపు 16 ఏళ్ల తరువాత కలుసుకున్న వారంతా ఒకరినొకరు పోల్చుకుంటూ.. ఆటపట్టించుకుంటూ సందడి చేశారు. హుకుంపేట బొప్పన సావిత్రమ్మ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2007-2008 పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం పాఠశాల ఆవరణలో ఆత్మీయ సమ్మేళనం పేరుతో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను సత్కరించారు. వివిధ కార్యక్రమాలు నిర్వహించి, ఆనందంగా గడిపారు. ఉత్సాహంగా సాగిన ఈ కార్యక్రమంలో అందరూ డాన్సులు చేసి అలరించారు. చివరగా ఒకరినొకరు విడిచి వెళ్లేటప్పుడు వారంతా తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. పూర్వ విద్యార్థులు డి.వీరబాబు, ఎస్.అహ్మద్‌వలి, కె.శంకర్, శుభాకర్, మౌనిక ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసేందుకు కృషి చేశారు. వీరికి పూర్వ విద్యార్థులంతా కృతజ్ఞతలు తెలిపారు.

గొయ్యిలో పడిన ఆటో



కుమ్మరి గొయ్యిలో పడిన ఆటో

సీతానగరం: మండల కేంద్రమైన సీతానగరం ఆర్టీసీ బస్‌స్టేషన్ వద్ద ఆటో అదుపుతప్పి కుమ్మరి గొయ్యిలోకి పడింది. బస్ స్టేషన్‌ను ఆనుకుని కుమ్మరిగొయ్యి ఉంది. గొయ్యి అంచున ఆటోస్టాండ్ ఏర్పాటు చేసుకున్నారు. ఆటో నిలిపిన తరువాత బస్ స్టేషన్ వద్ద ప్రయాణికులు ఆటో ఎక్కి కూర్చుంటారు. ప్రయాణికులు నిండాక ఆటో బయలుదేరుతుంది. ఆదివారం బస్‌స్టేషన్ వద్ద పెద్దగా ప్రయాణికులు లేకపోవడంతో ఆటో ఖాళీగా ఉంది. ఆటో స్టాండ్‌లో ఉంచిన ఆటో అదుపుతప్పి 20 మీటర్లు లోతున గొయ్యిలోకి పడింది. తుప్పలు ఉండటంతో పది అడుగులకు వెళ్లి ఆగింది. పొక్లెయిన్ సహాయంతో ఆటోను బయటకు తీశారు.

పోలీసుల విస్తృత దాడులు

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరు పోలీస్ స్టేషన్ ఎస్సై అంకారావు తన సిబ్బందితో కలిసి ఆదివారం హుకుంపేట గ్రామంలో సారా బట్టీలపై దాడులు నిర్వహించారు. 50 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. కవలగొయ్యి గ్రామంలో కోడిపందాలు ఆడుతున్న ముగ్గురిని అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.450 నగదు, రెండు కోడిపుంజులను స్వాధీనం చేసుకున్నారు. బుచ్చియ్యనగర్‌లో పేకాట ఆడుతున్న ఆరుగురిని అరెస్టు చేసి, వారి వద్ద నుంచి రూ.4,550, పేకముక్కలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు. నిందితులపై కేసులు నమోదు చేశామన్నారు.

రాజులోవ సేవలు చిరస్మరణీయం

ప్రకాశం నగర్: సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజులోవ సేవలు చిరస్మరణీయమని సీపీఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్ కొనియాడారు. ఆదివారం స్థానిక శ్యామల సెంటర్‌లోని సీపీఎం కార్యాలయంలో రాజులోవ ప్రథమ వర్ధంతి సభ నిర్వహించారు. తొలుత రాజులోవ చిత్రపటానికి అరుణ్‌తో పాటు, కార్యవర్గ సభ్యులు రాంబాబు, నాయకులు పోలిన వెంకటేశ్వరావు, ఎస్ఎస్ మూర్తి, బి.పవన్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అరుణ్ మాట్లాడుతూ, నమ్మిన సిద్ధాంతాలను ముందుకు తీసుకువెళ్లడమే రాజులోవకు ఇచ్చే ఘన నివాళి అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బి.పూర్ణిమరాజు, సుందర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ధర్మ పరిరక్షణకు భారత పాదయాత్ర



పాదయాత్రలో సంకీర్తనలు ఆలపిస్తున్న భక్త బృందం



రథంలో జగన్నాథ, సుభద్ర, బలభద్ర విగ్రహాలు

ఇస్కాన్ ఆధ్వర్యంలో నగరానికి చేరిక

సీటీఆర్ఐ: దేశమంతా ధర్మ పరిరక్షణ కోసం జరుపుతున్న పాదయాత్ర ఆదివారం నగరానికి చేరింది. ఇస్కాన్ ఆధ్వర్యంలో 20 మంది బృందం ఈ పాదయాత్రలో పాల్గొన్నారు. ఈ పాదయాత్ర ద్వారా దేశంలో సనాతన ధర్మం పరిఢవిల్లాలని, సనాతన ధర్మం దేశమంతా వ్యాపించాలని యాత్ర కొనసాగిస్తున్నారు. 2021లో గుజరాత్‌లో ప్రారంభమైన ఈ యాత్ర ఆదివారం రాజమహేంద్రవరం చేరింది. 1984లో ప్రారంభమైన ఈ పాదయాత్ర ఆరు సార్లు దేశం మొత్తం చుట్టి వచ్చింది. మధుర, హరిద్వార్, చార్‌ధామ్ యాత్ర, అయోధ్య, ప్రయాగ, కాశీ, మాయాపూర్ పూర్తి చేసుకుని దక్షిణ భారత దేశానికి చేరుకుంది. కూర్మక్షేత్రం, శ్రీకాకుళం, విశాఖపట్నం, సింహాచలం, అన్నవరం మీదుగా రాజమహేంద్రవరం చేరింది. ఇక్కడి నుంచి కొవ్వూరు మీదుగా విజయవాడ వెళుతుంది. ఈ పాదయాత్రకు శివానంద నిమాయదాస్, హేమ నిమాయదాస్, శ్యామంగాదాస్ స్వాగతం పలికారు.

కుటుంబమే అసలైన పాఠశాల

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఇన్‌చార్జి సెక్రటరీ జానీబాషా



సమావేశంలో మాట్లాడుతున్న జానీబాషా

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): సమాజంలో కుటుంబమే అసలైన పాఠశాల అని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఇన్‌చార్జి సెక్రటరీ షేక్ జానీబాషా అన్నారు. అంతర్జాతీయ తప్పిపోయిన బాలల దినం సందర్భంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, మహిళా, శిశు సంక్షేమ సంస్థ సంయుక్తాధ్వర్యంలో ఆదివారం స్థానిక కేవీ స్టేట్‌హోమ్‌లో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జానీబాషా మాట్లాడుతూ, కాలానుగుణంగా మారుతున్న సామాజిక పరిణామాలను దృష్టిలో ఉంచుకుని, పిల్లల మనోభావాలను అన్ని వేళలా తల్లిదండ్రులు అర్థం చేసుకునేందుకు యత్నించాలన్నారు. పిల్లలకు అతి గారాబం చేయకుండా, తమ బాధ్యతగా క్రమశిక్షణతో పెంచి ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలన్నారు. పిల్లలను వేధించడం, శారీరక హింసకు పాల్పడడం నేరమన్నారు. వారి హక్కులను హరించే ఎలాంటి చర్యనైనా తమ సంస్థకు తెలియజేయాలన్నారు. అనేక కారణాల వల్ల తప్పిపోయిన పిల్లలను ప్రభుత్వ సహకారం, సమన్వయంతో వారి తల్లిదండ్రులకు అప్పగించే ప్రయత్నం చేయాలన్నారు. ఎలాంటి న్యాయ సమస్యలున్నా, న్యాయ సేవల ఉచిత హెల్ప్‌లైన్ నంబర్ 15100ను సంప్రదించాలన్నారు. చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ సూర్య ప్రభావతి మాట్లాడుతూ, ప్రతిఒక్కరూ, సామాజిక సేవాభావంతో ఎక్కడైనా పార్కుల్లో, కూడళ్లలో పిల్లలు ఒంటరిగా కనిపిస్తే, వారు తప్పిపోయి ఉండవచ్చనే భావన కలిగితే సమీపంలోని పోలీస్ స్టేషన్, చైల్డ్ వెల్ఫేర్ కమిటీకి వారిని అప్పగించాలన్నారు. కార్యక్రమంలో ఆర్పీఎఫ్ సీఐ రాజు పాల్గొన్నారు.

ఆపరేషన్ కగార్‌పై న్యాయ విచారణ జరిపించాలి

- ఏపీఆర్‌సీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు
- సింగంపల్లిలో నిరసన కార్యక్రమం



సింగంపల్లిలో నిరసన తెలుపుతున్న ఏపీ రైతు కూలీ సంఘం నాయకులు

రంగంపేట: కేంద్రం ఆపరేషన్ కగార్ పేరుతో జరుపుతున్న మారణ హోమంపై సుప్రీం కోర్టు జోక్యం చేసుకుని, స్వతంత్ర న్యాయ కమిషన్‌తో విచారణ జరిపించాలని ఆంధ్రప్రదేశ్ రైతుకూలీ సంఘం (ఏపీఆర్‌సీఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు డిమాండ్ చేశారు. ఏపీ ఆర్‌సీఎస్ ఆధ్వర్యంలో ఆదివారం మండలంలోని సింగంపల్లి గ్రామం సీపీ రెడ్డి కాలనీలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ముందుగా ఎన్‌కౌంటర్‌లో అమరులైన మావోయిస్టు కేంద్ర కార్యదర్శి నంబాల కేశవరావు సహా, అమరులందరికీ నివాళులర్పించారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వీరాంజనేయులు మాట్లాడుతూ, ఎమర్జెన్సీ విధించిన ఇందిరాగాంధీని నేటికీ విమర్శిస్తున్న బీజేపీ.. శాంతి చర్చలు కోరుతున్న వారిని కాల్చి చంపుతామని ప్రకటించడం ఏ రకంగా రాజ్యాంగ పాలనో ప్రజలు గమనించాలన్నారు. ఆపరేషన్ కగార్‌ను బేషరతుగా నిలిపివేసి, మావోయిస్టులతో చర్చలకు చర్యలు తీసుకోవాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు. మావోయిస్టు నేత నంబాల కేశవరావు సహా, 27 మంది మరణాలను హత్యలుగా భావిస్తూ, సుప్రీం కోర్టు మార్గదర్శకాల ప్రకారం బాధ్యులపై 302 సెక్షన్ కింద కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. వీడియో రికార్డింగ్ ద్వారా బంధువుల సమక్షంలో పోస్టుమార్టం నిర్వహించి, మృతదేహాలను వారి కుటుంబ సభ్యులకు అప్పగించాలన్నారు. మృతదేహాల కోసం కోర్టుకెళ్లే దుస్థితి తలెత్తడం విచారకరమన్నారు. 2024 జనవరిలో ఆపరేషన్ కగార్ మొదలైనప్పటి నుంచి నంబాల కేశవరావు మృతి వరకు జరిగిన సంఘటలన్నిటిపైనా స్వతంత్ర కమిషన్ ద్వారా సుప్రీం కోర్టు విచారణ జరిపించాలని కోరారు. ఆపరేషన్ కగార్‌ను నిలిపివేసి, శాంతి చర్చల కమిటీ సభ్యుల మధ్యవర్తిత్వంలో కేంద్రం వెంటనే మావోయిస్టు ఆదివాసీ సీఏసీలో శాంతి చర్చలకు ముందుకు రావాలన్నారు. గడచిన 16 ఏళ్లలో ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని అడవులు, బొగ్గు గనులు, ఇతర ఖనిజ సంపదపై జరిగిన వ్యాపార ఒప్పందాలన్నింటినీ ప్రభుత్వం బహిరంగపరచాలని డిమాండ్ చేశారు. పరాయి దేశంతో శాంతి చర్చలు జరిపి, ప్రజల కోసం పోరాడుతున్న మావోయిస్టులతో చర్చలు జరపకపోవడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఆర్‌సీఎస్ జిల్లా అధ్యక్షుడు వల్లూరి రాజబాబు, ప్రగతిశీల మహిళా సంఘం నాయకులు రెడ్డి దేవి, నాయకులు దేశెట్టి సురేష్, చెక్కా సత్తిబాబు, కొల్లి రాంబాబు, రాయుడు కన్నా, పద్మ, రత్నం, జగన్ తదితరులు పాల్గొన్నారు.

నూతన ర్యాంపుపై ప్రజాభిప్రాయ సేకరణ

సీతానగరం: ములకల్లంకలో నూతన ఇసుక ర్యాంపుపై ప్రజాభిప్రాయ సేకరణ గ్రామ సభను అధికారులు ఆదివారం నిర్వహించారు. తహసీల్దార్ ఎ.శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ గ్రామసభలో గెయిల్ డిప్యూటీ కలెక్టర్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ శంకర్, మైన్స్ ఏడీ ఫణిభూషణ్‌రెడ్డి పాల్గొన్నారు. గ్రామ ప్రజల అభిప్రాయంతోనే నూతన ఇసుక ర్యాంపు ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని అధికారులు తెలిపారు. ములకల్లంక రెవెన్యూలోని 14/6, 15/2, 20/7తో పాటు, 16 సర్వే నంబర్లలోని 10.654 హెక్టార్ల భూమిలో 3,19,620 క్యూబిక్ మీటర్లలో ఇసుక తవ్వకాలు జరుగుతాయన్నారు. గోదావరి పరివాహక ప్రాంతంలో తవ్విన ఇసుకను మునికూడలి ర్యాంపు నుంచి రవాణా చేస్తారన్నారు. ఇసుక తవ్వకాలపై గ్రామ ప్రజల ఏకాభిప్రాయాన్ని పరిగణనలోకి తీసుకుని ప్రభుత్వానికి నివేదిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ, రెవెన్యూ సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

పరిశోధన పత్రాల సమర్పణ

రాజానగరం: అంతర్జాతీయ ఆన్‌లైన్ సదస్సులో తమ యూనివర్సిటీకి చెందిన విద్యార్థులు పరిశోధన పత్రాలను సమర్పించారని జీజీయూ ప్రొఫెసర్ వీసీ కేవీబీ రాజు తెలిపారు. అంతర్జాతీయ సొసైటీ ఫర్ ఎడ్యుకేషన్ లీడర్‌షిప్ (ఐఎస్ఈఎల్), ఎంఐటీ ఆర్ట్ డిజైన్ అండ్ టెక్నాలజీ యూనివర్సిటీ (పుణే) సంయుక్త ఆధ్వర్యంలో కేంబ్రిడ్జి యూనివర్సిటీ ప్రెస్ అండ్ అసెస్మెంట్ (యూకే) సహకారంతో శుక్ర, శనివారాల్లో ఈ సదస్సు జరిగింది. బీటెక్ విద్యార్థులు కె.యశ్వంత్ రెడ్డి, ఎం.స్నేహిత్‌బాబు, హర్ష శ్రీవాస్తవ్, మనీష్ ఏఐపై పరిశోధన పత్రాలను సమర్పించారు.